రేవు దాటి.. తెప్ప తగలేసి..

- వంచన ప్రభుత్వంపై ప్రజల మండిపాటు
- వైఎస్సార్ సీపీ 'ఫీజు పోరు'కు ప్రజా మద్దతు
- జగన్ ప్రభుత్వంలో విద్యార్థులకు రూ 622.21 కోట్లు
- సూపర్ సిక్స్ హామీల అమలును అటకెక్కించిన కూటమి ప్రభుత్వం
- నమ్మించి మోసం చేశారని ఆగ్రహం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు ప్రతి నెలా ఏదో ఒక పథకం కింద సంక్షేమ ఫలాలు దక్కడంతో సంతోషంగా జీవించిన పేదలకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం షాక్‌ల మీద షాక్‌లు ఇస్తోంది. సంపద సృష్టించాకే.. సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులెత్తేయడంపై అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారు. పేద, మధ్యతరగతి ప్రజల తరఫున ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ ఈ నెల 5న తలపెట్టిన 'ఫీజు పోరు'కు ప్రజలు మద్దతుగా సిద్ధమవుతున్నారు.



విద్యాదీవెన చెక్ అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

కొత్తపేట: సూపర్ సిక్స్ హామీల అమలుకు కూటమి సర్కార్ మంగళం పాడింది. అధికారం చేపట్టి ఎనిమిది నెలలు కావస్తోన్నా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండి వుంటే నెలకో సంక్షేమ పథకం కింద బ్యాంకు ఖాతాకు నేరుగా డబ్బులు పడేవి. ఆర్థిక ఇబ్బందులకు తావు లేకుండా అవసరాలు తీరేవి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త హామీలు అమలు దేవుడెరుగు.. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలకు తిలోదకాలు వదిలారు. అంటూ పేద, మధ్యతరగతి ప్రజలు మదనపడుతున్నారు. ఓ వైపు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగుల పింఛన్ల తొలగింపునకు జాబితా సిద్ధం చేస్తున్నారు. తల్లికి వందనానికి పంగనామాలు పెట్టారు. నేతన్న నేస్తం కనుమరుగైంది. అన్నదాత సుఖీభవ అటకెక్కింది. ఉచిత పంటల బీమా ఎత్తేశారు. వసతి దీవెన, విద్యా దీవెన, తోడు, సున్నా వడ్డీ, వాహనమిత్ర లాంటి పథకాలు కనుమరుగైపోయాయి. మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి ఇప్పట్లో లేనట్టేనని సర్కార్ తేల్చేసింది. దీంతో పేదలు కూటమి ప్రభుత్వంపై రగిలిపోతున్నారు.

జగన్ హయాంలో సంక్షేమం 5290.17 కోట్లు

గత జగన్ ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రత్యక్ష, పరోక్ష నగదు బదిలీ కింద కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో అర్హులైన లబ్ధిదారులందరికీ జగనన్న అమ్మ ఒడి, డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ, రుణ మాఫీ (ఆసరా), వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ బీమా, వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ రైతు భరోసా, పంట రుణాలు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వాహనమిత్ర, వైఎస్సార్ కాపు నేస్తం, జగనన్న తోడు, చేదోడు వంటి 33 పథకాలకు సంబంధించి సుమారు 5,290.17 కోట్ల లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసి జగన్ ప్రభుత్వం పేద వర్గాలకు అండగా నిలిచింది.

విద్యార్థులకు రూ.622.21 కోట్లు

ప్రధానంగా విద్యార్థులకు సంబంధించి ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకూ జగన్ ప్రభుత్వం అమలు చేసిన అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన పథకాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడు నియోజకవర్గాల్లో పై మూడు పథకాల కింద 1,35,111 మంది విద్యార్థులకు రూ.622.21 కోట్లు వారి ఖాతాలకు జమ చేసి, విద్యను, విద్యార్థులను ప్రోత్సహించింది. వాటిని ప్రస్తుత కూటమి సర్కార్ గాలికొదిలేసింది. ఒక్క పథకాన్ని సక్రమంగా అమలు చేయకపోగా, సంపద సృష్టించాకే సూపర్‌సిక్స్ హామీలంటూ సీఎం చంద్రబాబు మరో పిడుగులాంటి వార్త జనం నెత్తిన వేశారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజల నుంచి ప్రభుత్వంపై ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి.

పథకాలు వెంటనే అమలు చేయాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో సంక్షేమ పథకాలు అందించి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు న్యాయం చేశారు. ప్రస్తుత కూటమి సర్కార్ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ముఖ్యంగా విద్యార్థులకు సంబంధించి అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు అమలు చేయకపోవడం దారుణం

– **నేరేడుమిల్లి నరేష్**, అధ్యక్షుడు, మండల విద్యార్థి విభాగం, గంటి

హామీలు అమలు చేయాలి



జగన్ చెప్పింది చెప్పినట్టు అన్ని పథకాలు అమలు చేశారు. కానీ ఈ ప్రభుత్వం కొత్త పథకాల మాట దేవుడెరుగు ఉన్న పథకాలు ఇవ్వకుండా పేదల పొట్ట కొట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అందించాలి. అమ్మ ఒడి వంటి విదార్థుల ప్రోత్సాహక పథకాలు తక్షణం అమలు చేసి ఆదుకోవాలి.

– **పుచ్చకాయల మంగ**, విద్యార్థిని తల్లి, గంటి

క్లుప్తంగా

ఘనంగా వార్షికోత్సవ పూజలు


పెదపట్నంలంక షిర్డీ సాయి ఆలయంలో భక్తుల పూజలు

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువు దీరిన శ్రీషిర్డీ సాయిబాబా ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాకడ హారతితో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బుట్టబొమ్మలు, కేరళ వాయిద్య కళాకారుల విన్యాసాలు, మేళతాళాలతో బాబా ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో వైనతేయ గోదావరి నది వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. వైనతేయ గోదావరి నదిలో స్నానం చేయించిన అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తిని ఊరేగిస్తూ ఆలయానికి తీసుకువచ్చారు. రాజోలుకు చెందిన దత్తసాయి నామార్చన సత్సంగం ఆధ్వర్యంలో నక్షత్ర మాలిక, పుష్పాభిషేకం ఘనంగా జరిగింది. దూద్ హారతి, దీపాలంకరణ, శేజ్ హారతి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారీ సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

రాతి గుమ్మాల ఏర్పాటుకు పూజలు


నూకాంబిక ఆలయంలో రాతిగుమ్మాల ఏర్పాటుకు పూజలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న రాజగోపురంలోని రాతిగుమ్మాల ఏర్పాటుకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైట్ల గంగరాజు, గన్ని సూరిబాబు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు రాతి గుమ్మాల ఏర్పాటు పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో తిలకించారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠ

మామిడికుదురు: బి.దొడ్డవరంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఉమా సోమేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఓం నమశ్శివాయ, ఓం నమశ్శివాయ అంటూ భక్తులు శివనామ స్మరణ చేస్తుండగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో కంభంపాటి సుబ్రహ్మణ్యశ్రీనివాసశర్మ, పోచిరాజు వెంకటరామ నాగేశ్వరరావు, పోచిరాజు కిరణ్‌కుమార్ దంపతులు ఈ ప్రతిష్ఠ కార్యక్రమాలను దిగ్విజయంగా జరిపించారు. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ ఈ కార్యక్రమం ఆద్యంతం కన్నుల పండువలా జరిగింది. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ ప్రతినిధులు

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ మండల సమావేశం సోమవారం ఉదయం 9 గంటలకు గంగలకుర్రు మలుపు వద్ద నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశానికి అయినవిల్లి జెడ్పీటీసీ సభ్యుడు, నియోజకవర్గ సమన్వయకర్త గన్నవరపు శ్రీనివాసరావు పాల్గొంటారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అన్ని విభాగాల ప్రజాప్రతినిధులు, అనుబంధ శాఖల నాయకులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు


అంబాజీపేటలో పూజలు చేస్తున్న భక్తులు

అంబాజీపేట: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వసంత పంచమి, రథసప్తమిలను పురస్కరించుకుని సూర్యభగవానుడికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు చంద్రమౌళీ ధనుష్ శర్మ ఆధ్వర్యంలో సూర్యునికి పూజలు చేశారు. రథసప్తమిని పురస్కరించుకుని మూడు రోజులు ప్రత్యేక పూజలు జరపనున్నట్లు ఆర్యవైశ్య సంఘ నాయకులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య మహిళలు ఆదిత్య హృదయం సహస్రం చేశారు.

ఉచిత వైద్య శిబిరం

అయినవిల్లి: మండలంలోని ఎస్.మూలపాలెంలో ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. సూర్యప్రభ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు.

వీణా నాదం.. పరమేశ్వరునికి ప్రీతికరం

ఏకాదశ రుద్రుల సన్నిధిలో వీణకచేరి

అంబాజీపేట: వీణా నాదం పరమేశ్వరునితో పాటు సంగీత విద్వాంసులకు ఎంతో ప్రీతికరమని నెల్లూరుకు చెందిన శ్రీకంఠం నాగలక్ష్మి అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో ఉమా పార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీ, భూ సమేత కేశవ స్వామి వార్ల దేవస్థాన ప్రాంగణంలో శివకేశవ యూత్ ఆధ్వర్యంలో నాగలక్ష్మితో ఆదివారం వీణ కచేరీ నిర్వహించారు. నాగలక్ష్మి మాట్లాడుతూ శ్రీహరికోటలో ఉద్యోగిగా పనిచేసినప్పటికీ సంగీతంపై ఉండే మక్కువతో ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తి వీణ సాధన చేశానన్నారు. తన భర్త మాధవరావు ప్రోత్సహించడంతో తిరుపతి, వారణాసి, తిరువనంతపురం, శ్రీశైలం తదితర పేరుగాంచిన ప్రముఖ దేవాలయాల్లో వీణా కచేరీలు నిర్వహించానన్నారు. ఏకాదశ రుద్రుల కీర్తి తెలుసుకొని ఏకాదశ రుద్రుల సన్నిధిలో వీణ కచేరీ చేయాలని నిర్వాహకులు కోరాడంతో ఈ ప్రోగ్రాం చేశానన్నారు. ఏకాదశ రుద్రులు కొలువుదీరిన ముక్కామల, ఇరుసుమండ, మొసలపల్లి, వక్కలంక, కముజువారిలంక, గంగలకుర్రు, కె.పెదపూడి తదితర శివాలయాల్లో వీణ కచేరీని నిర్వహించారు. అనంతరం నాగలక్ష్మి, మాధవరావు దంపతులను శివకేశవ యూత్, స్థానికుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి ఏకాదశరుద్రుల చిత్రపటాన్ని అందజేశారు.


జి.అగ్రహారంలో నాగలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న శివకేశవ యూత్ సభ్యులు

వైభవంగా నాగ ప్రతిష్ఠలు

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీతీరం పాశర్లపూడిలంకలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత నాగేంద్రస్వామి ఆలయం వద్ద నాగ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త దంపతులు ఈ నాగ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. వేద పండితులు ఆదిరాజు నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. కుటుంబ వృద్ధితో పాటు సంతానం కోసం పలువురు దంపతులు, వివాహం కొరకు యువతీ, యువకులు ఈ నాగ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నాగదేవతల ప్రతిమలకు పూజలు నిర్వహించిన తర్వాత వాటిని ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. ముందుగా నాగేంద్రస్వామికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గంటి బాలసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల కోలాహలం మధ్య శాస్త్రోక్తంగా నాగేంద్రస్వామికి పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి లక్ష బిల్వార్చన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ఉత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం వద్ద మంగళవారం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.


పాశర్లపూడిలంకలో నాగప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్త దంపతులు

ఆలయ అభివృద్ధికి చర్యలు


ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను సన్మానించిన ట్రస్ట్ సభ్యులు

మలికిపురం: స్థానిక ఎత్తు వంతెన వద్ద నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున సహకరిస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన శ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆలయ నిర్మాణంతో పాటు ఇక్కడ వంతెన అభివృద్ధి, రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దేవను శాలువాతో సన్మానించారు. వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు పల్లపోతు బంగారం, మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద కాపు, వర్తక సంఘం అధ్యక్షులు మిరియాల హనుమంతరావు, రాజోలు వైస్ ఎంపీపీ ఇంటిపల్లి ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆమోదయోగ్యంగా బడ్జెట్

మలికిపురం: కేంద్రం ప్రకటించిన బడ్జెట్ జనరంజకంగా ఉందని జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసు నగేష్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు వరాల జల్లు కురిపించారని పోలవరం ప్రాజెక్టుకి గ్రాంట్ రూపంలో రూ.12.157 కోట్లు, విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.3.295 కోట్లు, కోర్టుకు సామర్థ్యం పెంచే విధంగా రూ.730 కోట్లు నిధులు ప్రకటించిందని వారన్నారు. పన్ను రాయితీ, వడ్డీ రహిత రుణాలు ద్వారా అనేక ప్రయోజనాలు కల్పించిందని అన్నారు.

శ్రీనివాసరెడ్డి సామాజిక దృక్పథాన్ని అభినందించాలి

రావులపాలెం: గ్రామానికి చెందిన పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి గోదావరి నది కాలుష్యంపై చేసిన అధ్యయనానికి భోపాల్‌కి చెందిన ఎస్ఆర్‌కే యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్ ఇవ్వడం ఈ ప్రాంతానికి గర్వకారణమని ఆయన సామాజిక దృక్పథాన్ని అభినందించాలని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వేమన కల్చరల్ అసోసియేషన్ భవనంలో శ్రీనివాసరెడ్డి అభినందన సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొన్నారు. శ్రీనివాసరెడ్డి దంపతులను పూలమాలలు, దృశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రావులపాలెం ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, టింబర్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాసరెడ్డి దంపతులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఫీజుపోరుతో ప్రభుత్వంపై పోరాటం

అయినవిల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ అమలు చేస్తామని పేదలకు అన్నింటా భరోసా కల్పిస్తామని ఎన్నికల హామీలను ఇచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు కల్లబొల్లి మాటలతో రాష్ట్ర ప్రజలు మభ్యపెట్టారని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు దుయ్యబట్టారు. అయినవిల్లి మండలం సిరిపల్లిలో ఆదివారం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. గన్నవరపు మాట్లాడుతూ ఈ నెల 5న నిర్వహించనున్న ఫీజు పోరు ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులకు, కార్యకర్తలను, అభిమానులకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి మాట్లాడుతూ చంద్రబాబుకు మాటలు మార్చడం, ప్రజలను మోసగించడంలో ఆరితేరారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళనలతో ప్రజలకు తాము సాధించి పెడతామన్నారు. అనంతరం శ్రీనివాసరావు ఫీజు పోరుకు చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. తొలుత పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విద్యాసాగర్, శ్రీనివాసరావు, రాజేశ్వరీదేవి, కిరణ్‌కుమార్‌లను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.కిరణ్‌కుమార్, తోరం భాస్కరరావు, మిండగుదిటి శిరీష్, మట్టపర్తి శ్రీనివాస్, కుడుపూడి శాంతావతి, చేట్ల రామారావు, మిండగుదిటి రాంబాబు, రమణాతి రాంబాబు ఉన్నారు.


ఫీజు పోరు పోస్టర్‌తో కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి తదితరులు

అంతర్వేదిలో కొత్తపేట డీఎస్పీ పర్యటన


అంతర్వేది క్షేత్రంలో ఆలయం వెలుపల క్యూ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీమోహన్

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో ఆదివారం కొత్తపేట నూతన డీఎస్పీ ఎస్.మురళీమోహన్ పర్యటించారు. ఈ సందర్భంగా శాఖా పరంగా తీర్థంలో భక్తుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. ఇందులో భాగంగా కల్యాణ వేదిక వద్ద వీఐపీ, సాధారణ భక్తుల గ్యాలరీల ఏర్పాటు గురించి ఏసీ వి.సత్యనారాయణతో సమీక్షించారు. ఇందుకు సంబంధించి సిద్ధం చేసిన మ్యాప్‌ను డీఎస్పీ పరిశీలించారు. అలాగే వీఐపీ, శీఘ్ర, సాధారణ దర్శనాల నిమిత్తం దేవస్థానం ఏర్పాటు చేస్తున్న క్యూలను కూడా డీఎస్పీ చూశారు. అలాగే బీచ్‌లో స్నానఘట్టాలు వద్ద భద్రతా చర్యలపై డీఎస్పీ, కింది స్థాయి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. వెంట రాజోలు సీఐ టీవీ నరేష్ కుమార్, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'డయల్ యువర్ కమిషనర్' రద్దు

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అమలాపురం మున్సిపల్ కార్యాయలంలో ప్రతి సోమవారం నిర్వహించ తలపెట్టిన 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 8వ తేదీన తిరిగి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

మెగా శిబిరంలో 60 మంది రక్తదానం


మామిడికుదురులో రక్తదానం చేస్తున్న దాతలు

మామిడికుదురు: కోనసీమ బ్లడ్ డోనర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో 60 మంది దాతలు రక్తదానం చేశారు. మామిడికుదురు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనంలో ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ శిబిరం ఏర్పాటు చేశారు. దాతల నుంచి సేకరించిన రక్తం తలసేమియా, రక్తహీనత కలిగిన చిన్న పిల్లలు, గర్భిణులు, ప్రమాదాల బారిన పడి ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి ఉపయోగపడుతుందని సేవా సంస్థ అధ్యక్షులు కాంద్రేగుల నరేంద్ర తెలిపారు. సంస్థ ఏర్పాటు చేసిన నాటి నుంచి నేటి వరకు ఎంతో మందికి తమ సంస్థ ద్వారా రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చిట్టూరి జైకుమార్, నాగాబత్తుల ధర్మతేజ, చెల్లింగి కార్తీక్ సాయి, కంచి ప్రశాంత్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా మరమ్మతులు


మొసలపల్లి రహదారిలో లేచిపోయిన కంకర రాళ్లు, బూడిద

అంబాజీపేట: కూటమి ప్రభుత్వం పనిచేసేది గోరంత... ప్రచారం కొండంత అనే చందంగా తయారైంది. ఇందుకు ఇటీవల రోడ్ల మరమ్మతులే నిదర్శనం. పుల్లేటికుర్రు నుంచి మొసలపల్లి వెళ్లే రహదారిలో వంతెన వద్ద ఉన్న గోతులను మరమ్మతులు చేశారు. అయితే కంకరరాళ్లు, బూడిద పైకి లేచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులతో పాటు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. కేవలం కూటమి ప్రభుత్వం రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకునేందుకు తూతూ మంత్రంగా మరమ్మతులను అధికారులతో చేయించారని ప్రయాణికులు విమర్శలు గుప్పిస్తున్నారు. కె.పెదపూడి ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలను తాత్కాలికంగా పూడ్చారే తప్ప శాశ్వత పరిష్కారం చేయకుండా చేతులు దులుపుకుంటున్నారని విమర్శిస్తున్నారు.

ముకేందరస్వామికి అవార్డు


పురందర అనుగ్రహ ప్రశస్త అవార్డు స్వీకరిస్తున్న ముకేందరస్వామి

ఆలమూరు: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.ముకేందరస్వామికి పురందర అనుగ్రహ ప్రశస్త అవార్డుకు ఎంపికయ్యారు. దాస సాహిత్య ప్రచారంలో భాగంగా విరివిగా భజన మండళ్లు ఏర్పాటు చేసినందుకు గాను టీడీపీ ఈఅవార్డుకు ఎంపిక చేసింది. ఇటీవల తిరుమలతో జరిగిన పురంధరదాసు ఆరాధనోత్సవాల్లో భాగంగా దాస సాహిత్య ప్రాజెక్టు డైరెక్టర్ పగడాల ఆనంద తీర్థాచార్యులు చేతుల మీదుగా పురంధర అనుగ్రహ ప్రశస్త అవార్డును అందుకున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం తెలియజేసింది. ఆధ్యాత్మికవేత్తగా ప్రఖ్యాతి గాంచిన ముకేందరస్వామికి ఈ అవార్డు రావడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఇంధనాన్ని పొదుపు చేద్దాం

సఖినేటిపల్లి: ఇంధనాన్ని పొదుపు చేద్దాం, భావితరాలను అంధకారం నుంచి కాపాడుదాం అని ఏపీ ఎన్జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ గుండేపల్లి ప్రభావతి అన్నారు. ఆదివారం సఖినేటిపల్లిలంక శివారు ఊదపోడులో చిత్తడి నేలల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఇంధనాన్ని పొదుపు చేయడంపై స్థానికులకు ఆమె అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ప్రభావతి ఆధ్వర్యంలో ఎకో క్లబ్ విద్యార్థులతో ఇంటింటికీ వెళ్లారు. నీటిని పొదుపుగా వాడడం గురించి, కరెంటును ఆదాచేయడం గురించి వివరించారు. ప్రతి నీటి బొట్టును ప్రాణపదంగా భావించాలని ఆమె సూచించారు. గ్రామ పెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు.

బాబూరావు మృతికి సంతాపం

అంబాజీపేట: శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి మనవడు, కేంద్ర శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి బాబురావు మృతికి గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం శెట్టిబలిజ సంఘ నాయకులు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి ఎనలేని కృషి చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. బాబూరావు పార్థివదేహాన్ని హైదరాబాద్ నుంచి సోమవారం ఉదయం 10 గంటలకు ఆయన స్వగృహం అల్లవరం మండలం బోడసకుర్రుకు తీసుకురానున్నారన్నారు. శెట్టిబలిజ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించాలని కోరారు. బాబూరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని సంఘ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.

రోగులకు బ్రెడ్లు, స్వీట్ల పంపిణీ

మామిడికుదురు: ఇస్లాం మత వ్యవస్థాపకుడు మహ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్ జయంతిని ఆదివారం నగరం, రాజోలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా నగరం గ్రామానికి చెందిన గురుహె మొహిబ్బానే జహెరా సంఘం ఆధ్వర్యంలో రాజోలు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు బ్రెడ్, పాలు, స్వీట్లు పంచారు. ఇమామ్ హుస్సేన్ సూచించిన ఉప దేశాలను ముద్రించిన కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో సయ్యద్ రూహి, మస్తాన్ అలీ, ముర్తజా హైదర్ తదితరులు పాల్గొన్నారు.


రాజోలులో రోగులకు పంపిణీ చేస్తున్న పండ్లు

మంచుటెండలు


గంగలకుర్రు మలుపులో ఉదయం 9.30 గంటలకు కురుస్తున్న మంచు


కె.పెదపూడిలో ఉదయం 11 గంటలకు ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న రహదారి

- విభిన్న వాతావరణం
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

అంబాజీపేట: వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గత కొద్ది రోజులుగా పి.గన్నవరం నియోజకవర్గంలోని అయినవిల్లి, అంబాజీపేట, మామిడికుదురు, పి.గన్నవరం మండలాల్లో విభిన్నమైన పలు వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. రాత్రి వేళల్లో తీవ్రమైన చలి గాలులు విజృంభిస్తుండగా ఉదయం పొగమంచు కమ్మేస్తుంది. అలాగే చలి గాలులు కూడా తీవ్రంగా వీస్తున్నాయి. మధ్యాహ్న సమయానికి తీవ్రమైన ఎండ దంచి కొడుతుంది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని భానుడు తన ప్రతాపం చూపించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచకపోతే మంచు, ఎండల కారణంగా విపరీతంగా దోమలు పెరిగే అవకాశం ఉందని, వీటి వల్ల మలేరియా, విషజ్వరాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు.